అధికారులు సమన్వయంతో పనిచేయాలి

బక్రీద్ పండగ ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ సమీక్ష

చార్మినార్: బక్రీద్ పండగ సందర్భంగా ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగల అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. రానున్న బక్రీద్ పండగ ను పురస్కరించుకొని పూల్బాగ్ లోని జోనల్ కార్యాలయంలో గురువారం జోనల్ కమిషనర్ అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 17న జరుగనున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుర్బానీ చేసిన వ్యర్థాలను రోడ్లపై వేయకుండా ఇంటింటికి గార్బేజ్ కవర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. జంతువు వ్యర్థాలను ఆయా ప్రాంతాల ప్రజలు తాము అందజేసిన గార్బేజ్ కవర్లలో వేసి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటో టిప్పర్ సిబ్బందికి అందజేయాలన్నారు. జంతు వ్యర్థలను తొలగించేందుకు ప్రత్యేక బృందాలు, జేసీబీలు, అదనపు వాహనాలను ఏర్పాటు చేసి ఓపెన్ గార్బేజ్ పాయింట్ లలో చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించనున్నామన్నారు. సమావేశంలో చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శివకుమార్, సురేందర్, సరిత, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, డిప్యూటీ కమిషనర్ (ఎస్ డబ్ల్యూ ఎం) రాజేష్ కుమార్, ఈఈలు నరేందర్ గౌడ్, సనావుద్దీన్, పీర్ సింగ్, హరి కిషోర్, ప్రకాశం, ఏఎంహెచ్ ఓ లు, డీఈ లు, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, ఆరోగ్యం పారిశుధ్యం విభాగం, అధికారులు, సానిటరీ సూపర్వైజర్ పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలని ఉర్దూ తెహ్రీఖ్ అధ్యక్షులు ఎజాజ్ అలీ ఖురేషీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉర్దూ తెహ్రీఖ్ అధ్యక్షులు ఎజాజ్ అలీ ఖురేషీ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బందం ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్‌కు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ కార్యాలయాల్లో ఉర్దూ బాషలో ప్రత్యుత్తరాలు కొనసాగిస్తూనే..కార్యాలయాల బోర్డుల్లో సైతం ఉర్దూ అక్షరాలతో ఉండాలన్నారు. కరీంఖాన్,మహ్మద్ జహీర్, బషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్‌ను సన్మానిస్తున్న ఎజాజ్ అలీ ఖురేషి తదితరులు

ఈద్గాలను పరిశీలించిన ఎమ్మెల్యే



కుతుబ్‌షాహి ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: బక్రీద్ పండుగ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలోని ఈద్గాల వద్ద అవసరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి ఈద్గాలను పరిశీలించారు. మొదటగా గోల్కొండ సమీపంలోని చారిత్రక కుతుబ్‌షాహీ ఈద్గాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. బక్రీద్ పండుగ రోజున ప్రార్థనలకు వచ్చే వారికి అవసరమైన అన్ని పనులు పండుగ ఒక రోజు ముందుగానే పూర్తి చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆయన హకీంపేట్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని ఈద్గాలను సైతం పరిశీలించారు. టోలిచౌకీ, గోల్కొండ, కార్వాన్, గుడిమల్కాపూర్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాలలోని జామా మసీదుల వద్ద వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన బల్దియా అధికారులను కోరారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

అబిడ్స్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వంతోనే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర సీనియర్ మహిళా నాయకురాలు బండారి రాధిక పేర్కొన్నారు. గురువారం కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కిషన్‌రెడ్డిని ఆమె సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి రాధిక మాట్లాడుతూ.... రాబోయే కాలంలో తెలంగాణలో కూడా బీజేపీదే అధికారమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు నెలల్లో ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు.



మంత్రి కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బండారి రాధిక

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి మెమోరాండం అందజేస్తున్న శివరాములు, కమల్‌వీరేష్ తదితరులు

అబిడ్స్: కాశ్మీర్‌లో ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు రాష్ట్రపతిని కోరారు. గురువారం భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, భాగ్యనగర్ విభాగ విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కమల్‌వీరేష్, విశేష సంపర్క్, తెలంగాణ ప్రాంత ప్రముఖ్ వెంకటేశ్వర్‌లు పేర్కొన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 9వ తేదీన జమ్ముకాశ్మీర్ ప్రాంతంలో హిందూ భక్తులపై ఉగ్రవాదులు దాడిచేయడం ధారుణమన్నారు. కాశ్మీర్ పరిసర ప్రాంతాల్లో పాకిస్తాన్‌కు చెందిన ఇస్లామిక్ హిందూ భక్తులపై దాడులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రత్యేక చర్యలు తీసుకుని ఇలాంటి దాడులు మరోసారి జరుగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ గోల్కొండ జిల్లా కార్యదర్శి చిల్కుల రామారావు, శశికాంత్‌లు పాల్గొన్నారు.

అమ్మాయిల చదువు దేశానికే వెలుగు

చాంద్రాయణగుట్ట: అమ్మాయిల చదువు దేశానికే వెలుగుగా నిలుస్తుందని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సామాజిక వేత్తలు హిమజ, మల్లీశ్వరీల ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్టలోని రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సు బాలికల క్యాంప్ పాఠశాలలో బాలికలు–చదువు అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ....ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు ఆకర్షణకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేదింపుల వల్లే ఏటా 24.6 కోట్ల మంది బాలికలు అర్థంతరంగా చదువును ముగిస్తున్నారన్నారు. అనంతరం బాలికలకు భగవద్గీత శతకాలు, పజిల్స్ పుస్తకాలు, శానిటరీ న్యాప్కిన్స్‌ను అందజేశారు.



విద్యార్థినులకు న్యాప్కిన్స్‌ను అందజేస్తున్న డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

త్యాగానికి ప్రతీక బక్రీద్

పాతబస్తీలో మొదలైన పండగ సందడి



ఖుర్బానీకి సిద్ధంగా పొట్టేళ్లు

చార్మినార్: పాతబస్తీలో బక్రీద్ సందడి మొదలైంది. పాతబస్తీలోని ప్రధాన కూడళ్ల వద్ద సంబంధిత పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. నిబంధలన ప్రకారమే జంతువులను పాతబస్తీకి తరలించి బక్రీద్‌ను జరుపుకోవాలని సంబంధిత పోలీసు అధికారులు కోరుతున్నారు. ఈ నెల 17వ తేదీన ముస్లిం సోదరులు బక్రీదు పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఆయా ప్రాంతాల ముస్లిం ప్రజలు తమకు కావాల్సిన గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తున్నారు. త్యాగానికి మరో పేరుగా నిర్వహించుకునే ఈ బక్రీదు పండుగ కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు పాతబస్తీకి తరలి వచ్చాయి. పాతబస్తీ శివారులోని ప్రధాన కూడళ్లలో గొర్రెలు, మేకలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. గతేడాది కన్నా ఈసారి పొట్టేళ్లు,మేకల రేట్లు అధికంగా ఉన్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే బరువుకు అనుగుణంగా వీటి రేట్లుంటాయి.

ఇది ఆనవాయితీ

ముస్లింలకు ప్రధానంగా ఏడాదికి రెండే రెండు పండుగలు రంజాన్, బక్రీద్. అల్లాహ్‌పై భక్తికి రంజాన్ ప్రతిరూపమైతే త్యాగానికి ప్రతిరూపం బక్రీద్. ఆరాధించే అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని నాటి ప్రవక్త ఇబ్రహీం (అ), ఇస్మాయిల్ (అ)ల త్యాగనిరతిని ఈ బక్రీద్ పండుగ గుర్తు చేస్తుంది. బక్రీద్‌ను 'ఈద్–ఉల్–అజ్‌హ' అని కూడా అంటారు. ఇస్లామిక్ చరిత్రలో ఇబ్రహీంది ప్రముఖ స్థానం. అల్లాహ్ పెట్టిన పరీక్షలలో అన్నింటిలో నెగ్గిన ప్రవక్త ఇతను. ఓ సారి ఇబ్రహీంను తన పేర అతని ముద్దుల కుమారుడు ఇస్మాయిల్‌ని బలివ్వాలని ఆదేశిస్తాడు. అల్లాహ్ ఆదేశానుసారం మానవ బంధుత్వాలకతీతంగా ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు. తండ్రి మాట ప్రకారం అల్లాహ్ కోసం ప్రాణత్యాగానికి ఇస్మాయిల్ సిద్ధమవుతాడు. స్వయంగా తన కుమారుడిని బలివ్వడానికి సిద్ధమైన ఇబ్రాహీం త్యాగాన్ని అల్లాహ్ మెచ్చుకొని కుమారుడి బదులు ఓ జీవాన్ని బలివ్వాలని కోరడం....ఆ రోజు నుంచి ఆనవాయితీగా బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది. ఇస్లాం మూల స్తంభాలలో హజ్ కూడా ఇదే రోజు చేస్తారు.

ఆర్థికంగా బాగున్న ప్రతి ముస్లీం ఖుర్బానీ ఇవ్వడం అతని విధి. పొట్టేలు, మేకలు, ఆవులు, దూడలతో పాటు ఒంటెలను ఖుర్బానీ ఇవ్వడం జరుగుతోంది.

మూడు భాగాలుగా ఖుర్బానీ మాంసం...

ఖుర్బానీ ఇచ్చే వారికి ముఖ్యంగా వడ్డీతో కూడిన అప్పు ఇవ్వరాదు....తీసుకోరాదు. చిన్నజీవాలను వ్యక్తిగతంగా, పెద్ద జీవాలను ఏడుగురు భాగస్వాములై ఉండాలి. అల్లాహ్ పేర బలిచ్చిన ఈ జంతువుల మాంసాన్ని మూడు సమాన భాగాలను చేయాలి. దీంట్లో ఒకభాగం ఖుర్బానీ ఇస్తున్న వారు తీసుకొని....రెండో భాగాన్ని తమ బంధువులకు... మూడో భాగాన్ని పేద ముస్లీంలకు పంచాలి. బలిచ్చే జంతువులకు శరీర భాగాలలో ఎలాంటి లోపం ఉండరాదు.

ఖుర్బానీకి ప్రతిఫలం పుణ్యం....

బలివ్వడానికి జంతువును కోసే సమయంలో దాని రక్తపు చుక్క భూమిపై పడేకంటే ముందే ఆ జంతువు శరీరంపైనున్న వెంట్రుకల సమానంగా వారికి పుణ్యం లభిస్తుందని ఇస్లాం చెబుతోందని మత పెద్దలు అంటున్నారు. అందుకని ప్రతి ముస్లీం విధిగా ఖుర్బానీ ఇస్తారంటున్నారు. ప్రతి ముస్లీం తన జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ చేయాలను కుంటాడు. ఇది ముస్లీంల ఫర్జ్. ఇస్లాం మూల స్తంబాలలో హజ్ ఒకటి. ఈ బక్రీద్ పండుగ రోజే హజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హజ్ చేసే ముందు కూడా ప్రతి హాజీ విధిగా ఖుర్బానీ ఇవ్వాల్సిందే.

రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి

సుల్తాన్‌బజార్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న బస్తీ దవాఖానాలల్లో రెగ్యులర్ డాక్టర్లను, నర్సులను నియమించాలని ప్రజలు వర్షాకాలంలో అంటువ్యాధులు, విష జ్వరాల బారిన పడకుండా చర్యలను తీసుకోవాలని డైరెక్టరేట్ ఆప్ పబ్లిక్ హెల్త్ తెలంగాణ కార్యాలయంలో పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యు, ఐఎఫ్‌టీయు నాయకులు వినతి పత్రం అందేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ మాట్లాడుతూ.... బస్తీ దవాఖానల్లో పనిచేసే డాక్టర్లకు 3 నుండి 4 ఆసుపత్రుల్లో బాధితులు ఉండడం వల్ల వారు రోజుకొక హాస్పిటల్‌కు హాజరవుతున్నారన్నారు. కొన్ని ఆసుపత్రుల్లో డాక్టర్లు లేక రోగులు తీవ్రమైన ఇబ్బందులకు గురవతున్నారన్నారు.

నిధుల గందరగోళంపై నిగ్గు తేల్చాలి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో జరుగుతున్న నిధుల గందరగోళంపై విచారణ చేపట్టాలని మాజీ ఫోర్ మెన్ కమిటీ చైర్ పర్సన్లు శివకుమార్, భద్రీనాథ్ గౌడ్, పోసాని సురేందర్ ముదిరాజ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. 2021–22, 2023–24 సంవత్సరాలలో అప్పటి చైర్మన్లు ఆదాయ వ్యయాలకు సంబంధించి వివరాలు వెల్లడించనందుకు ఇప్పటికే దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చిందన్నారు. దీంతో పాటు వీరి హయాంలో దేవాదాయ ఆదాయంతో ప్రైవేట్ వ్యక్తులపై ఆస్తులు కొనుగోలు చేశారంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. ప్రత్యేకాధికారి పర్యవేక్షణలోనే ఈ సారి బోనాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు సుధాకర్ ముదిరాజ్, సదానంద్ ముదిరాజ్, రంగ శ్రీకాంత్ గౌడ్ ఉన్నారు.

ప్రజాదరణకు ఇదే నిదర్శనం

సుల్తాన్‌బజార్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన ఎంపీ బండి సంజయ్‌కు బీజేపీ సీనియర్ నాయకులు సందీప్‌కుమార్, ఇతర నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుని ప్రజల్లో ఉన్న ఆదరణను చూపిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 3వ సారి ప్రధాని కావడం దేశ ప్రజలు ఎంతో హర్షిస్తున్నారన్నారు.



మంత్రి బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సందీప్‌కుమార్

'స్వచ్ఛ హిమాయత్‌నగర్'పై అవగాహన

హిమాయత్‌నగర్: స్వచ్ఛ హిమాయత్‌నగర్ సాధన కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం విట్టల్ వాడీ, ఆయిల్ సీడ్స్ కాలనీ, ఇతర ప్రాంతాల్లో పబ్లిక్ ఏరియాలలో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు.

సంప్రదాయాలకు అనుగుణంగా బోధన



విద్యార్థులను సన్మానిస్తున్న డైరెక్టర్ శ్యామ్‌వెర, సునీత తదితరులు

జియాగూడ: సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా జియాగూడ విద్యశ్రీ హైస్కూల్‌లో విద్యాబోధన చేస్తున్నామని స్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెరా, కరస్పాండెంట్ సునిత శ్యామ్‌లు అన్నారు. విద్యాలయం ప్రాంగణంలో సరస్వతి పూజలు, 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మానం, క్రీడలు, యోగాలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శ్యామ్‌వెరా మాట్లాడుతూ.... ఈ సారి 10వ తరగతిలో 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణ సాధించారని పేర్కొన్నారు. ఇందుకు గాను రెండుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రులచే ప్రతిభా అవార్డు పురస్కారాలను అందుకున్నామన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడేందుకు కృషి చేయండి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నాంపల్లి తహశీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌తో సమావేశమై పలు సమస్యలను ఆయనకు వివరించారు. గ్యాన్‌బాగ్ కాలనీలోని మున్సిపల్ స్థలంలో అక్రమంగా నిర్మాణలు చేస్తున్నవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అక్రమ కట్టడాలను ఆపాలన్నారు. ఈ అక్రమ కట్టడాలపై నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, బాబా షరుపుద్దీన్, సయ్యద్ యూసుఫ్, ఖాజా, ఖలీల్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి



ఉద్యోగుల సమావేశంలో డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: ఆయుష్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా ఆయుష్ విభాగం అధ్యక్షులు టి.నర్సింహాస్వామి, కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్, ఇతర నాయకులు గురువారం సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనికి వారి సమస్యలు వివరించారు. జీఓ నెంబర్: 317 ప్రకారం..... అన్యాయంగా కలిపిన యూనిట్లను వేరు చేయాలన్నారు. ఆయుష్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్దీకరించాలన్నారు. 4వ తరగతి ఉద్యోగుల ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు.

దంచికొట్టిన వాన



ఛత్రినాక చౌరస్తాలో ప్రవహిస్తున్న వరద నీరు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలో గురువారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంట పాటు కురిసిన ఈ వర్షంతో నీరు రోడ్లపై నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఛత్రినాక చౌరస్తాలో రాకపోకలు సాగించేందుకు వీలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లించారు. రోడ్లపై నిలిచిన నీటిని జీహెచ్ఎంసీ సిబ్బంది నాలాల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఉప్పుగూడలోని లోతట్టు ప్రాంతాలలో గంటల తరబడి నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

బండి సంజయ్‌కు పలువురి అభినందన



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న బండి సంజయ్.

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. నగరానికి వచ్చిన సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిసి అభినందించి సన్మానించారు.

కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న మహ్మద్ బషీర్

గోల్కొండ: సంఘ సేవకులు, తోటి ఉద్యోగుల సహకారంతో తాను నిర్వహిస్తున్న నిత్యన్నదాన కార్యక్రమాన్ని మునుముందు కూడా కొనసాగిస్తామని గోల్కొండ సెకండ్ లాన్సర్ బలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బషీర్ అన్నారు. గురువారం ఆయన ఎస్ఎంజే క్యాన్సర్ ఆసుపత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సేవ కంటే మరో మంచి కార్యం లేదని అన్నారు.

పార్టీ కోసం పని చేసే వారికి ప్రాధాన్యం

గోల్కొండ: పార్టీ కోసం పని చేసే వారికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ గురువారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో గతంలో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో దేవర శ్రీనివాస్ చురుకుగా పాల్గొన్నారని అన్నారు. అనంతరం ఎంపీ దేవర శ్రీనివాస్‌ను శాలువా కప్పి సన్మానించారు.



బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

బడిబాట విజయవంతం



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: తాము నిర్వహించిన బడిబాట కార్యక్రమం పూర్తిగా విజయవంతం అయిందని గోల్కొండ బడాబజార్‌లోని ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. గురువారం పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులతో పాటు పాతవారికి కూడా పాఠ్య పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా తాము ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరామన్నారు.

చెట్ల కొమ్మలు, చెత్తా చెదారం తొలగింపు

చార్మినార్: సమన్వయ లోపం–ప్రజలకు శాపం శీర్షికతో ఈ నెల 9న, సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబందిత అధికారులు స్పందించారు. చెట్ల కొమ్మల తొలగింపులో నిర్లక్ష్యం..చెత్త కుప్పలతో తప్పని తిప్పలు..ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు అంటూ జీహెచ్‌యంసీ,టీఎస్ఎస్‌పీడీసీఎల్ ప్రభుత్వ విభాగాల నడుమ సమన్వయ లోపంతో సమస్యలు తలెత్తుతున్నాయనే విషయాలను అధికారుల దష్టికి తీసుకువచ్చింది. దీంతో స్పందించిన అధికారులు చెట్ల కొమ్మలతో పాటు పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు.



గాంధీనగర్‌లో చెట్ల కొమ్మలతో పాటు చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


గుర్తు తెలియని యువకుడిహత్య

నాంపల్లి: అనుమానాస్పద స్థితిలో హైదరాబాదు రైల్వే స్టేషన్ ముఖ ద్వారం వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడి తలపై బండరాళ్లతో మోది కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుని క్లూస్‌టీమ్‌కు సమాచారం అందించారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. హత్యకు గురైన వ్యక్తి ఒంటిపైన ఎర్రటి టీ షర్టు, నల్లని ప్యాంటు ధరించినట్లు నాంపల్లి శాంతిభద్రతల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్ పేర్కొన్నారు.



హత్యకు గురైన గుర్తు తెలియని యువకుడి దృశ్యం

డాక్టరేట్ ప్రదానం



ఆమనికి డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: ఆమని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మలుగు ఆమనికి హోలీ స్పిరిట్ క్రిస్టియన్ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు గురువారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు డాక్టరేట్ ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిషప్ ఆనంద్, డాక్టర్ అబ్రహం, కుసుమ బోగరాజు, భారతి, యమున పాల్గొన్నారు.